www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 328 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | బుధవారం 07-08-2024

MHR TV

www. mhrtv.com

## అమెరికా అధ్యక్ష బరిలో కమలా హారిస్




### డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పేరు ఖరారు

### ఆన్‌లైన్ ఓటింగ్‌లో 99శాతం మద్దతు ఆమెకే..

**వెబ్ డెస్క్, ఆగస్టు 6 (ప్రజాస్వరం):** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా భారత, ఆఫ్రికన్ సంతతికి చెందిన మహిళ కమలా హారిస్ పేరు అధికారికంగా ఖరారైంది. డెమొక్రటిక్ పార్టీ నేషనల్ కన్వెన్షన్ లో భాగంగా అధ్యక్ష అభ్యర్థి ఎంపిక కోసం ఐదు రోజులుగా ఆన్ లైన్ లో నిర్వహించిన ఓట్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ఆ పార్టీ ప్రతినిధుల నుంచి 4 వేల 567 ఓట్లు రాగా, వీటిలో 99 శాతం కమలాహారిస్ కు అనుకూలంగా పడ్డాయి. దీంతో ఆ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమలా పేరును ఖరారు చేశారు.

## ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా




- జావెలిన్ త్రో లో మరో అద్భుత ప్రదర్శన
- 89.34 మీటర్లు విసిరి క్వాలిఫై..
- రేపు తుది సమరం..
- గోల్డ్ మెడల్‌పై క్రీడాభిమానుల్లో ఆశలు

2



## ప్రతి కమతానికి 'భూధార్'

- భూముల నిర్వహణ పారదర్శకంగా ఉంచేందుకు సర్కారు చర్యలు
- త్వరలో అమలులోకి రానున్న కొత్త చట్టం
- అసెంబ్లీలో 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదా
- తహసీల్దార్లతో పాటు ఆర్డీవోలకూ మ్యుటేషన్ అధికారం
- బాధితులకు అప్పీల్, రివిజన్‌లకు వెసులుబాటు
- ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం చట్టం
- ఈ నెల 23లోగా అభ్యంతరాల స్వీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 5, (ప్రజాస్వరం):** భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించిన తర్వాత చట్టంగా మారుస్తామని తెలిపింది. ఆగస్టు 23వ తేదీ వరకు అభ్యంతరాలను సేకరించనున్నారు.ఈ ముసాయిదా ప్రకారం తహసీల్దార్లతో పాటు ఆర్డీవోలకూ మ్యుటేషన్ చేసే అధికారం ఇవ్వనుంది. మ్యుటేషన్ సమయంలో విచారణకు అవకాశం కల్పిస్తుండగా తప్పుగా తేలితే మ్యుటేషన్ నిలిపివేసే అధికారాలను కట్టబెట్టనుంది. ప్రతి భూ కమతానికి భూ ఆధార్ ఉండనుంది. హక్కుల బదలాయింపు జరగ్గానే గ్రామ పహాణీలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటారు. అప్పీల్, రివిజన్‌లకు వెసులుబాటు కల్పిస్తూ బిల్లును రూపొందించారు.ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూధార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూధార్ మిగతా 2లో..

## విలేకరులు కావలెను

### ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

**సెల్ : 800 860 9999**



హైదరాబాద్ లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలతోనివాళులర్పిస్తున్న తలసాని

## ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు

- ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి
- రాష్ట్రవ్యాప్తంగా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి
- చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలతో నివాళి
- వారి ఆశయాలను నెరవేర్చాలని సీఎం రేవంత్, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు



న్యూయార్క్ లో వివిధ కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

## స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

### రెండు రోజుల్లో బాధ్యతల స్వీకరణ..!

- హైదరాబాద్ లో 10 లక్షల చ.అ విస్తీర్ణంలో కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్
- వీ హబ్ లో వాల్స్ కర్రా హోల్డింగ్స్ గ్రూప్
- రూ.42 కోట్ల పెట్టుబడులు
- అమెరికా పర్యటనలో సీఎం రేవంత్ ప్రకటన
- వివిధ కంపెనీలతో కొనసాగుతున్న వరుస సమావేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం):** అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ రోజు కీలక ప్రకటన చేశారు. స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్ ను ప్రకటించారు. బిలియనీర్, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్ గా వ్యవహరిస్తారని వెల్లడించారు. మరో రెండు రోజుల్లోనే ఆయన బాధ్యతలు తీసుకునే అవకాశం ఉన్నదని వివరించారు. ఆగస్టు 1న రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణ నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అసెంబ్లీలో తెలిపారు. యువతకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఇలా నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేయనున్న ఈ యూనివర్సిటీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. స్కిల్ వర్సిటీకి చైర్మన్ ను నియమించారు. ఇక స్కిల్ యూనివర్సిటీ కోసం ప్రభుత్వం 57 ఎకరాల స్థలం కేటాయించింది. రూ.100 కోట్ల నిధులు విడుదల చేసింది. పబ్లిక్ ప్రైవేట్ (పీపీ) భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీ నిర్మించనున్నారు. వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు. మొత్తం 17 కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. రెండు రోజుల క్రితమే సీఎం రేవంత్ రెడ్డితో ఆనంద్ మహీంద్రా సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని దత్తత మిగతా 2లో..



ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జై శంకర్, పాల్గొన్న పార్టీల నేతలు

## భారతీయులకు ముప్పు లేదు

- అత్యవసరమైతే తరలించేందుకు సిద్ధం
- అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం
- షేక్ హసీనా విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు
- ఎక్కడికి వెళ్తారనేది ఆమే తేల్చుకోవాలి
- కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్
- పార్లమెంట్ లో అఖిలపక్ష సమావేశం
- హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరణ?
- బంగ్లాదేశ్‌లో పార్లమెంటు రద్దు
- కొనసాగుతున్న అల్లర్లు

ఢాకా, ఆగస్టు 6 : పొరుగు దేశం బంగ్లాదేశ్ లో ఏర్పడిన సంక్షోభం కారణం మన దేశంలో ఉత్పన్నమయ్యే పరిణామాలు, బంగ్లాదేశ్ లో ఉన్న భారతీయుల భద్రత, అవసరమైతే వారిని స్వదేశానికి తీసుకు రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర విదేశాంగ మంత్రి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పాటు దాదాపుగా అన్ని పార్టీల నుంచి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. బంగ్లాదేశ్ లో జరుగుతున్న పరిణామాలపై భారత్ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిందని ప్రస్తుతం భారత్ కు ఎలాంటి సమస్యలు రావని భావిస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. బంగ్లా సరిహద్దుల్లో ఇప్పటికే పూర్తి స్థాయిలో చెక్ పోస్టులు ఇతర భద్రతా ఏర్పాట్లు ఉన్నాయని ఆల్ పార్టీ నేతలకు కేంద్ర విదేశాంగ మంత్రి చెప్పారు. ఇప్పటి వరకూ మిగతా 2లో..



నిరసనకారులు నిప్పుపెట్టడంతో దహనమవుతున్న వాహనం

## డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరణ



- కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్సీ కవిత తరఫు లాయర్లు
- అంగీకరించిన రౌస్ అవెన్యూ కోర్టు
- తీహార్ జైలులో కవితతో ములాఖాతైనా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్

2

## ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో భారత్ మూడో స్థానం

- పెరిగిన స్వదేశీ ఉత్పత్తుల సామర్థ్యం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1 ముగింపులో $8.44 బిలియన్లు
- సత్ఫలితాలిస్తున్న 'మేకిన్ ఇండియా'

2



# స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

(మొదటి పేజీ తరువాయి)
తీసుకునేందుకు ఆయన అంగీకరించారు. త్వరలోనే స్కిల్ యూనివర్సిటీని పరిశీలించేందుకు తన బృందాన్ని పంపుతానని తెలిపారు. ఈ క్రమంలో చైర్మన్ గా కూడా ఆనంద్ మహీంద్రనే ప్రభుత్వం నియమించింది. ఇక ఆనంద్ గోపాల్ మహీంద్రా ఒక భారతీయ బిలియనీర్ వ్యాపారవేత్త. ముంబై ఆధారిత వ్యాపార సమ్మేళనం అయిన మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఏరోస్పేస్, అగ్రిబిజినెస్, అనంతర మార్కెట్, ఆటోమోటివ్, భాగాలు, నిర్మాణ పరికరాలు, రక్షణ, శక్తి, వ్యవసాయ పరికరాలు, ఆర్థిక మరియు బీమా, పారిశ్రామిక పరికరాలు, సమాచార సాంకేతికత, విశ్రాంతి మరియు ఆతిథ్యం, లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్ మరియు రిటైల్. మహీంద్రా మహీంద్రా – మహీంద్రా సహ వ్యవస్థాపకుడు జగదీష్ చంద్ర మహీంద్రా మనవడు . 2023 నాటికి, ఫోర్బ్స్ ప్రకారం అతని నికర విలువ రూ.2.1 బిలియన్లు. ఆనంద్ మహీంద్రా హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో హార్వర్డ్ బిజినెస్ స్కూల్ పూర్వ విద్యార్థి .1996లో ఆనంద్ మహీంద్రా భారతదేశంలో నిరుపేద బాలికల విద్యకు మద్దతు ఇచ్చే నాన్హి కాలీ అనే ప్రభుత్వేతర సంస్థను స్థాపించాడు. 2011 ఆసియాలోని 25 అత్యంత శక్తివంతమైన వ్యాపారవేత్తల జాబితాలో ఉన్నాడు. తెలంగాణలో యువత ఎక్కువగా ఉన్నా.. వారిలో నైపుణ్యం లేకపోవడంతో చాలా మంది ఉన్నత చదువులు చదివినా ఉపాధి పొందలేకపోతున్నారు. ఇలాంటి వారు డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ప్రభుత్వం భావించింది. వారికి ఉపాధి కల్పిస్తే.. డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయన్న ఆలోచనతోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వచ్చే ఏడాది నుంచి యూనివర్సిటీలో తరగతులు ప్రారంభించనున్నారు.ఇక తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పది రోజుల పర్యటన కోసం అమెరికా వెళ్లారు. అక్కడి ఎన్నారైలతో ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఎన్నారైలను ఆహ్వానించారు. అమెరికా పర్యటన తర్వాత ఈనెల 13న ఆయన తిరిగి రాష్ట్రానికి రానున్నారు. ఆయన వెంట అధికారులతోపాటు మంత్రులు కూడా ఉన్నారు.



**హైదరాబాద్ లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్**
ప్రపంచ స్థాయిలో ఐటి రంగంలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అధికారుల బృందం కాగ్నిజెంట్ రవికుమార్, కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. భేటీలో ఈ మేరకు ఒప్పందం జరిగింది. గత ఏడాది ముఖ్యమంత్రి బృందం దావోస్ పర్యటన సందర్భంగా ఈ ఒప్పందానికి పునాదులు పడ్డాయి.


ఫైల్

### వీ హబ్ లో రూ. 42 కోట్లు పెట్టుబడులు

గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో చిన్నచిన్న మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమేగాక...వారికి శిక్షణ చేయూతనిస్తున్న వీ హబ్‌కు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. అమెరికాకు చెందిన వాల్స్ కర్రా హోల్డింగ్స్ గ్రూప్ రాష్ట్రంలో రూ. 42 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. రాబోయే ఐదేళ్లలో స్టార్టప్‌లలో మొత్తం రూ. 839 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా వీహబ్‌లో ఈ సంస్థ రూ.42 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనుంది. వాల్ష్ కర్రా హోల్డింగ్స్ కంపెనీని గ్రెగ్‌వాల్ష్, ఫణికర్రా నిర్వహిస్తున్నారు. తెలంగాణకు చెందిన ఫణికర్రా..ఉస్మానియా వర్సిటీ పూర్వ విద్యార్థి. తెలంగాణలో చదివి అంతర్జాతీయస్థాయికి ఎదిగిన తనకు మళ్లీ మాతృభూమి రుణం తీర్చుకునే అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని ఫణి అన్నారు. తెలంగాణ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతోపాటు వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న వీహబ్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతోందన్నారు. వాల్స్ కర్రా హోల్డింగ్స్ సంస్థ అమెరికా, సింగపూర్‌లో విస్తరించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారంతో గ్రెస్‌వాల్ష్, ఫణి ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు చేసే స్టార్టప్‌లు, స్థిర లాభదాయకమైన సంస్థలకు ఈ కంపెనీ మద్దతిచ్చి పెట్టుబడులు పెడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ కంపెనీ ప్రతినిధులు, వీహబ్ సీఈవో సీతా పల్లచోళ్ల ఒప్పందం చేసుకున్నారు.

## హీరా గోల్డ్ కేసులో ముగిసిన ఈడీ సోదాలు

**12 కొత్త లగ్జరీ కార్లు, రూ.90లక్షల నగదు సీజ్**

**హైదరాబాద్ ఆగస్టు 5, (ప్రజాస్వరం) :** హీరా గోల్డ్ కేసులో ఈడీ సోదాలు ముగిశాయి. సోదాల్లో 12 కొత్త లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నారు. 90 లక్షల నగదు, 25 కోట్ల విలువ చేసే బినామీ ఆస్తుల పేపర్ల సీజ్ చేసారు. నౌహీరా షేక్ పేరు మీదున్న 13 ఆస్తుల పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హీరో గోల్డ్ అధిపతి నౌహీరా షేక్ 400 కోట్ల వరకు అక్రమంగా సంపాదించినట్లు గుర్తించారు. దేశవ్యాప్తంగా 60కిపైగా నౌహీరా పై కేసులు వున్నాయి. లోక్షా 72 వేల మంది బాధితుల్లో కేవలం 3 % మందికి మాత్రమే డిపాజిట్ దారులు నగదు వెనిక్కి ఇవ్వడానికి హీరా గోల్డ్ సంస్థ అంగీకరించింది. 5600 కోట్లలో కేవలం 317 కోట్లు క్లెయిమ్ చేసేందుకు నౌహిరా ముందుకు వచ్చింది. హీరా గోల్డ్ పై విచారణ కొనసాగుతోంది.

## అలుపెరుగని ఉద్యమ యోధుడు జయశంకర్

- తెలంగాణ కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు
- మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- బోయగూడలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి

**హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 90 వ జయంతి సందర్భంగా మంగళవారం బన్సీలాల్ పేట డివిజన్ బోయగూడ లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమస్ఫూర్తి ప్రదాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. గల్లీ నుండి ఢిల్లీ దాకా తీసుకెళ్ళడం, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవసరాన్ని వినిపించిన ఘనత జయశంకర్ సార్ కే దక్కుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో పోరాడిన జయశంకర్ రాష్ట్ర ఏర్పాటు ను చూడకుండానే మరణించారని, చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డివిజన్ BRS పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, రాజేందర్, ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హుజూర్ నగర్, ఆగస్టు 5 (ప్రజాస్వరం) :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ తో కలిసి సూపరింటెండెంట్, డాక్టర్లు, స్టాఫ్ నర్స్ లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు . హాస్పిటల్లో అందిస్తున్న ఆహారం, శానిటైజర్ సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.


హుజూర్ నగర్ ఏరియా హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్

## ప్రజావాణిలో 465 దరఖాస్తులు

### ప్రజా భవన్‌లో అర్జీలు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 465 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 117, పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 45, విద్యుత్ శాఖ కు సంబంధించి 31, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 39, మైనారిటీ వెల్ఫేర్ కు సంబంధించి 58, ఇతర శాఖలకు సంబంధించి 175 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

**హైదరాబాద్, ఆగస్టు 6 :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ కోర్టులో తాను దాఖలుచ చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ను ఉపసంహరించుకున్నారు. నిజానికి ఈ పిటిషన్ దాఖలు చేశారు కానీ వాదనలు వినిపించలేదు. పదే పదే వాయిదాలు కోరారు. సోమవారం కూడా ఈ పిటిషన్ పై రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. అయితే సీనియర్ లాయర్లు రానందున కేసు వాయిదా వేయాలని కవిత తరపు లాయర్లు కోరారు. దీంతో న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఎట్టి పరిస్థితుల్లోనూ వాదనలు వినిపించాలన్నారు. అయితే మంగళవారమే పిటిషన్ ఉపసంహరించుకుంటామని కవిత లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు కూడా అంగీకరించింది. అయితే కవిత హఠాత్తుగా డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకోవడం ఆసక్తికరంగా మారింది. సీబీఐ చార్జిషీటులో లోపాలు ఉన్నాయని కవిత ప్రధానంగా ఈ డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కానీ ఇటీవల సీబీఐ చార్జిషీటును కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కోర్టే పరిగణలోకి తీసుకున్నప్పుడు లోపాలు ఉంటాయని ఎలా అంటారని న్యాయస్థానం ప్రశ్నించి.. పిటిషన్ ను డిస్మిస్ చేసే అవకాశాలు ఉన్నాయని ఆమె తరపు లాయర్లు అనుకోవడం వల్లనే ఈ పిటిషన్ ఉపసంహరించుకున్నట్లుగా తెలుస్తోంది. తర్వాత అసలు బెయిల్ పిటిషన్ పై వాదనల్లో ప్రభావం చూపకుండా ఉపసంహరించుకోవడమే మంచిదని అనుకున్నారని అంచనా వేస్తున్నారు. కాగా, మంగళవారం తీహార్ జైల్లో ఉన్న కవితతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావులు ములాఖత్ అయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో దర్యాప్తు పూర్తయిందని ఇటీవలే సీబీఐ కోర్టుకు తెలిపింది. ఇప్పుడు దర్యాప్తు పూర్తయినందున .. ఇక తనకు బెయిల్ ఇవ్వాలని.. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉండదని పూర్తి స్థాయి బెయిల్ కోసం ప్రయత్నం చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అయితే కవిత అటు ఈడీ.. ఇటు సీబీఐ కేసుల్లోనూ బెయిల్ తెచ్చుకోవాల్సి ఉంది. అలా అయితేనే ఆమె బయటకు రాగలరు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు ఈడీ కేసులో బెయిల్ వచ్చింది కానీ సీబీఐ కేసులో ఇంకా రాలేదు.

## ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో భారత్ మూడో స్థానం

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా నినాదం.. దేశంలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టింది. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో అనేక రంగాలు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నాయి. ముఖ్యంగా భారతదేశంలో తయారీ రంగం లో శక్తివంతంగా మార్చేందుకు కేంద్రంలోని నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోంది.. దీనికి తగినట్లుగా.. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కింద మేకిన్ ఇండియా నినాదాన్ని తీసుకువచ్చి.. దాని కోసం అన్ని రకాలుగా సహాయ సహకరాలను అందిస్తోంది.. ఈ చొరవకు తగినట్లు ఎలక్ట్రానిక్స్ స్వదేశీ ఉత్పత్తులు కూడా పెరిగాయి.. ఇంకా ఎగుమతి చేయడమే కాదు.. ప్రపంచంలో ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఎగుమతి చేసే దేశాలలో భారత్ అగ్రస్థానంలో ఉండటం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

ఇటీవల కాలంలో భారత్ లో ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తితో పాటు ఎగుమతి కూడా భారీగా పెరిగింది.. భారతదేశంలో ఐఫోన్ మ్యానుఫాక్చరింగ్ సైతం చేస్తుండటం.. ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీతో ప్రపంచ మార్కెట్ లో భారీ డిమాండ్ నెలకొంది. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వస్తువులు, యాపిల్ (ఐఫోన్), మొబైల్ ఫోన్స్ ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. భారతదేశం నుంచి యాపిల్ ఐఫోన్ ఎగుమతుల పెరుగుదల కారణంగా, ఎలక్ట్రానిక్స్ 2024–25 (FY25) ఏప్రిల్–జూన్ త్రైమాసికం (Q1) చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 10 దేశాల ఎగుమతులలో భారతదేశం మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది.. కేవలం ఇంజినీరింగ్ వస్తువులు.. పెట్రోలియం ఉత్పత్తులు మాత్రమే అధిక ర్యాంక్ లో ఉండగా.. 2023–24 (FY24) అదే త్రైమాసికంలో ఎలక్ట్రానిక్స్ రంగం నాల్గవ స్థానాన్ని ఆక్రమించింది.

వాణిజ్య విభాగం విడుదల చేసిన డేటా ప్రకారం, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 22 శాతం పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (FY25) క్యూ1 ముగింపులో $8.44 బిలియన్లకు చేరుకుంది. ఈ క్రమంలో అశ్విని వైష్ణవ్ కీలక ట్వీట్ చేశారు. భారత్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతి ఇప్పుడు టాప్ 3లో ఉందని పేర్కొన్నారు. మేకింగ్ ఇన్ ఇండియా.. ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేస్తుందంటూ పేర్కొన్నారు.ప్రధాని మోదీ కూడా స్పందించారు. అశ్విని వైష్ణవ్ ట్వీట్ కు రిట్వీట్ చేసిన ప్రధాని మోదీ.. ఇది నిజంగా ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ లో భారతదేశం నైపుణ్యం మా వినూత్నమైన యువశక్తి ద్వారా ఆధారితమైనది. సంస్కరణలు, ప్రోత్సాహంపై మా ప్రాధాన్యతకు ఇది నిదర్శనం మేక్ ఇన్ ఇండియా అని పేర్కొన్నారు. రానున్న కాలంలోనూ ఇదే జోరును కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందని తెలిపారు.

## ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా

- ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రో లో మరో అద్భుత ప్రదర్శన
- 89.34 మీటర్లు విసిరి అర్హత సాధించిన నీరజ్
- రేపు తుది సమరం

లండన్, ఆగస్టు 6 : డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా సోమవారం స్టేడ్ డి ఫ్రాన్స్ లో 89.34 మీటర్ల త్రో (గ్రూప్ బీ)తో పారిస్ ఒలింపిక్స్ లో జావెలిన్ త్రో ఫైనల్ కు అర్హత సాధించాడు. ఇది గ్లోబల్ ఛాంపియన్ షిప్ లో నీరజ్ కి అత్యుత్తమ త్రో గా నిలిచింది. స్టాక్ హోమ్ డైమండ్ లీగ్ లో 89.94 మీటర్ల తర్వాత అతని రెండో అత్యుత్తమ త్రో ఇదే కావడం గమనార్హం. తొలి ప్రయత్నంలోనే అర్హత సాధించాడు. అంతకు ముందు దోహాలో నీరజ్ 88.36 మీటర్లు విసిరాడు. అలాగే, పావో నుర్మి గేమ్స్ లో 85.97 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. క్వాలిఫికేషన్ ఈవెంట్ లో, నీరజ్ సహచర భారత అథ్లెట్ కిషోర్ జెనా గ్రూప్ ఏలో 80.73 మీటర్లు విసిరాడు. అదే సమయంలో, కెన్యాకు చెందిన జూలియస్ యెగో, చెక్ రిపబ్లిక్ కు చెందిన జాకుబ్ వడ్లెజ్ లు వరుసగా 85.97 మీటర్లు, 85.63 మీటర్లు విసిరి ఫైనల్ కు అర్హత సాధించారు. జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ కూడా 87.76 మీటర్ల త్రోతో అర్హత సాధించాడు.

## డైమండ్ ఫ్యాక్టరీకి 10 రోజులు సెలవులు


**ముంబై, ఆగస్టు 6:** ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వజ్రాల కంపెనీ కిరణ్ జెమ్స్ ఉత్పత్తిని నిలిపివేసింది. ఈ మేరకు ఆగస్టు 17 నుంచి 27 వరకు తమ ఉద్యోగులకు తప్పనిసరి సెలవు ప్రకటించింది. గుజరాత్ లోని ఈ డైమండ్ సంస్థ 50,000 మంది సిబ్బందికి 10 రోజుల సెలవు ప్రకటించింది. వజ్రాల ఉత్పత్తిని నియంత్రించేందుకు వీలుగా ఈ సెలవులు ఇచ్చినట్టుగా కంపెనీ తెలిపింది. వాస్తవానికి, ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ తగ్గడంతో, దేశంలో వజ్రాల వ్యాపారుల స్టాక్ పెరిగింది. ప్రపంచంలోని అతిపెద్ద సహజ వజ్రాల తయారీదారుగా, పాలిష్ చేసిన వజ్రాల అతిపెద్ద ఎగుమతిదారుల్లో కిరణ్ జెమ్స్ ఒకటి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా, జీ7 సభ్య దేశాలు రష్యా నుంచి వజ్రాలపై ఆంక్షలు విధించాయి. ఆ దేశాల నిర్ణయం భారత వజ్రాల పరిశ్రమపై పెను ప్రభావం చూపిందని అంటున్నారు. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా పాలిష్ చేసిన వజ్రాలకు డిమాండ్ లేదు. అందుకే వజ్రాల ఉత్పత్తిని నియంత్రించేందుకు పది రోజుల సెలవు ప్రకటించినట్టుగా కిరణ్ జెమ్స్ చైర్మన్ వల్లభాయ్ లఖానీ తెలిపారు. కంపెనీ చరిత్రలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారిగా చెప్పారు. అంతర్జాతీయంగా బ్యాండెడ్ వజ్రాల ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో వజ్రాల కంపెనీలు నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడుతున్నాయని లఖానీ అన్నారు. సరఫరాను నియంత్రిస్తే డిమాండ్ పెరిగి పరిశ్రమకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నట్టుగా చెప్పారు. రూ. 17,000 కోట్ల వార్షిక టర్నోవర్ తో కిరణ్ జెమ్స్, ప్రపంచంలోని ప్రముఖ వజ్రాల కంపెనీలలో ఒకటైన డి బీర్స్ కు చెందిన సైట్ హోల్డర్ లలో ఒకరు.

## ప్రతీ కమతానికి భూధారం

(మొదటి పేజీ తరువాయి)
కేటాయిస్తారు. గతంలో ఉన్న చట్టాల అమలులో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కొత్త చట్టం విషయంలో జాగ్రత్తలు తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పారు.2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్ట ప్రకారం చాలా ఇబ్బందులు ఉన్నాయి. అప్పీల్, రివిజన్ వ్యవస్థలు లేకపోవటంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉండటంతో క్షేత్రస్థాయిలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచెల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తహసీల్దారు, ఆర్డీవోల మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది. ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుంది. కొత్త చట్టం ద్వారా పహాణీలను కూడా అప్డేట్ చేస్తారు.ఈ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తోంది ప్రభుత్వం. https://ccla.telangana.gov.in/Wel come.do వెబ్ సైట్ ద్వారా అభిప్రాయలను సేకరించనుంది. ఇప్పటికే ముసాయిదా బిల్లును వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. ఆగస్టు 23వ తేదీ వరకు ప్రభుత్వానికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.సలహాలు, సూచనలను ror2024-rev@telangana.gov.in కు ఈ–మెయిల్ ద్వారా కూడా పంపే అవకాశం ఉంది. ఇలా కాకుండా ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్ఏ కార్యాలయం, నాంపల్లి స్టేషన్‌రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, అబిడ్స్, హైదరాబాద్–500001కు పోస్టు ద్వారా పంపే చాన్స్ ఉంది. అభ్యంతరాల స్వీకరణ తర్వాత.. పూర్తిస్థాయిలో చర్చించి కొత్త చట్టం తీసుకురానున్నారు.

# భారతీయులకు ముప్పులేదు

(మొదటి పేజీ తరువాయి)
బంగ్లాదేశ్ లో పన్నెండు నుంచి పదమూడు వేల మంది వరకూ భారతీయులు ఉంటారని అంచనా వేశారు. ప్రస్తుతానికి వారిని తరలించాల్సినంత ఘోరమైన పరిస్థితులు లేవని.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది కానీ.. భారతీయులకు వచ్చిన సమస్యలేమీ లేవని చెబుతున్నారు. ఘర్షణలు ప్రారంభ మైన తర్వాత ఎనిమిది వేల మంది విద్యార్థులు బంగ్లాదేశ్ నుంచి తిరిగి వచ్చారు. షేక్ హసీనా విషయంలో ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఆల్ పార్టీ మీటింగ్ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ విషయంలో విదేశాంగ మంత్రిని ఆయన మూడు కీలక ప్రశ్నలు వేశారు. బంగ్లాదేశ్ లో ఏర్పడిన సంక్షోభంలో విదేశీ శక్తుల హస్తం ఉందా అని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ మీద భారత్ దీర్ఘ కాలిక ప్రణాళిక, బంగ్లాదేశ్ లో ఏర్పడే కొత్త ప్రభుత్వం విషయంలో మన వ్యూహం ఏమిటి వంటి అంశాలపై రాహుల్ గాంధీ జైశంకర్ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇతర పార్టీల నుంచి హాజరైన వారు కూడా పలు సందేహాలకు సమాధానాలు తెలుసుకున్నారు. బంగ్లాదేశ్ లో పరిస్థితుల షేక్ హసీనా దేశం విడిచి వెళ్లాల్సి వచ్చింది. మా ప్రభుత్వం అవగాహన చేసుకుని ఏ నిర్ణయం తీసుకున్నా దానికి మేం అండగా ఉంటామని జేడీయూ తెలిపింది. సమావేశం జరిగిన తీరు పట్ల విపక్ష పార్టీలన్ని సంతృప్తి చెందాయి. బంగ్లాదేశ్ అంశంపై పార్లమెంట్ లో చర్చ జరపాలని విపక్షాలు కోరలేదని.. కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. హసీనా ఎక్కడకు వెళ్తారన్న అంశాన్ని ఆమె నిర్ణయించుకోవాల్సి ఉందని.. ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఆమె నిర్ణయం కోసం ప్రభుత్వం ఎదురు చూస్తున్నట్లుగా తెలుస్తోంది.


బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వీధుల్లో నిరసనకారుల ఆందోళన

**బంగ్లాదేశ్ లో పార్లమెంట్ రద్దు**

బంగ్లాదేశ్ లో సంక్షోభం మరింత ముదురుతోంది. ఇదివరకే ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి భారత్ కు వచ్చేశారు. మరోవైపు తాత్కాలికంగా సైనిక ప్రభుత్వం ఏర్పాటు అవుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ పార్లమెంటును రద్దు చేశారు. దేశంలో తలెత్తిన రాజకీయ సంక్షోభంతో పార్లమెంట్ ను రద్దుచేస్తూ నిర్ణయం తీసుకున్నారని వార్తా సంస్థ ఏఎఫ్ పీ రిపోర్ట్ చేసింది. నిరసనకారుల ప్రధాన డిమాండ్లలో పార్లమెంట్ రద్దు చేయడం సైతం ఒకటని తెలిసిందే.


మంటల్లో దహనమవుతున్న భవనం

### హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరణ?

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరించిందని సమాచారం. ప్రస్తుతం ఆమె భారత్ లో ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం హసీనాకు ఆశ్రయం కల్పించడం కష్టతరమని బ్రిటన్ తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో హసీనా ఇక కొంత కాలం భారత్ లోనే ఉండనున్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా
# ఉంచుకోవాలి
### జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోలికేరి



**మెదక్, ఆగస్టు 06 (ప్రజా స్వరం) :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం, స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నర్సాపూర్ పట్టణం, శివంపేట మండలం చిన్న గొట్టిముక్ల గ్రామాల్లో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోలికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి భారతి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ పచ్చదనం పెంపు లక్ష్యాలతో ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వారంలో రెండు రోజులు డ్రైడేగా పాటించాలని, ఇంట్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ద్వారా మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుతామో అదే విధంగా మన గ్రామాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డెంగ్యూ వ్యాధి నియంత్రణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉందని, భవిష్యత్తు లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద ఎత్తైన మొక్కలు మన నర్సరీల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యుత్ లైన్లు, త్రాగునీటి సరఫరా పైప్ లైన్లకు దూరంగా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించాలని, నర్సరీ లో మంచి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేర గ్రామంలో పచ్చదనం పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను ప్రతి రోజు పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, సంబంధిత మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తాం..





**మెదక్, ఆగస్టు 06 (ప్రజా స్వరం) :**
ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని వారు తెలంగాణ కోసం చేసిన కృషిని, త్యాగాన్ని మెదక్ కార్యాలయ సిబ్బంది స్మరించుకున్నారు. మంగళవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి ఏవో యూనస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ తొలిదశనుంచి మలి దశ ఉద్యమం దాకా తెలంగాణ సాధన దిశగా వారు చేసిన భావజాల వ్యాప్తి, దశాబ్దాలపాటు సాగిన ఉద్యమంలో వారు అందించిన అచంచల పోరాట స్ఫూర్తి అజరామరమైనదని కొనియాడారు. వారి అడుగుజాడల్లో తాను మలిదశ తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి దాకా శాంతియుత పద్దతిలో, పార్లమెంటరీ పంథాలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించి, అరవై ఏండ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తినే కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని ధారబోసారని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ మార్కెట్ జగపతి అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకుని వారి చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతిలు మాట్లాడుతూ జయశంకర్ సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ తన జీవితాంతం కష్టపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. తెలంగాణ ఉద్యమ భావజాల వ్యక్తికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డమీద కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్‌లు కృష్ణారెడ్డి, కిషోర్, జయరాజు, ఆర్‌కె శ్రీనివాస్, నాయకులు లింగరెడ్డి, ప్రభురెడ్డి, చింతల నర్సింహులు, గౌస్, మధు, నగేష్, శ్రీనివాస్, మహమ్మద్, ఇస్మాయిల్, కిరణ్, చందపాషా తదితరులు పాల్గొన్నారు.



### గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

**గజ్వేల్, ఆగస్టు 6 (ప్రజాస్వరం) :**
ప్రొఫెసర్ జయశంకర్ చిరస్మరణీయుడని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. మంగళవారం జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, నాయకులు సుభాష్ చంద్రబోస్, రాజు, సత్యనారాయణ, సమీర్, సర్దార్ ఖాన్, అజార్, జానీ, రాములుగౌడ్, ముత్యాలు, శ్రీనివాస్, మోహన్, శివారెడ్డి, రవీందర్ రెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు, కన్న పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మెదక్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి.
- మెదక్, ఆగస్టు 6 (ప్రజా స్వరం)



# స్కాలర్‌షిప్ విడుదల చేయాలి
### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్




**రామాయంపేట, ఆగస్టు 06 (ప్రజా సర్వం) :**
మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ మీటింగ్ స్థానిక బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 7000 కోట్ల ఉపకార వేతనాలను విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సంపత్, ప్రణయ్, మన దీక్షిత్, సతీష్, అశ్విత్., అభిషేక్, భరత్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చాలి

**మెదక్, ఆగస్టు 06 (ప్రజా స్వరం) :**
చేవెళ్ల సభలో ఎస్సీలకు తగు ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. మంగళవారం మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్‌కు దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల చేవెళ్ల సభలో ఎస్సీలకు తగు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. అంబేడ్కర్ అభయ హస్తం కింద ఎస్సీలకు 12 లక్షల ఆర్థికసాయం చేస్తామని చెప్పారన్నారు. ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ నిధులు 1000 కోట్లు కేటాయిస్తానని అని చెప్పి హామీ తుంగలో తొక్కరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెదక్ పట్టణ అధ్యక్షులు ప్రసాద్, రాము, లోకేష్, విఠలేష్, శివ, ఆంజనేయులు, భాను, సన్నీ, నర్సింహులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.







శ్రావణ మాసం పురస్కరించుకుని మంగళవారం మెదక్ పట్టణం గోల్కొండ వీధిలోని గట్టమ్మ దేవాలయంలో పురోహితులు దేశాయిపేట లింగమూర్తి శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యావాదనం, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక బోరంచమ్మ దేవాలయం నుండి గత్తమ్మ విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో పొత్తరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నారు. వర్షా న్నిసైతం లెక్క చేయకుండా ఊరేగింపు వైభవంగా సాగింది.
- మెదక్, ఆగస్ట్ 06 (ప్రజా స్వరం)

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత



**నిజాంపేట, ఆగస్టు 06 (ప్రజా సర్వం) :**
మెదక్ నియోజకవర్గం నిజాంపేట మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన పాపయ్య గారి బాబు మరణించడం బాధాకరమని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రోహిత్ పరామర్శించారు. అనంతరం బాబు భార్య నవితకు 1,25,000 రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

# రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



**రామాయంపేట, ఆగస్టు 6 (ప్రజా సర్వం) :**
మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని అర్హులైన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రుణమాఫీ సంబంధించిన గ్రీవెన్ సెల్, రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ రైతు బీమాతో రైతుల కుటుంబాలకు దీమా కలుగుతుందన్నారు. ఏదైనా అనివార్య కారణాలవల్ల రైతు మరణిస్తే అతడి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తీర్ణాధికారికి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను వెంటనే దరఖాస్తు ఫారంతో పాటుగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నారాయణ, వ్యవసాయ విస్తీర్ణాధికారులు స్రవంతి, సాయికృష్ణ, తేజస్విని, రాజు పాల్గొన్నారు.

మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి విచ్చేసిన సందర్భంగా రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గజవాడ నాగరాజు, పీఎసీఎస్ చైర్మన్ చంద్రం, రమేష్ తదితరులు మంగళవారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు
- రామయంపేట, ఆగస్టు 06 (ప్రజా సర్వం)



# నేర రహిత సమాజం పోలీసుల కృషి ముఖ్యం
### మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి





**మెదక్, ఆగస్ట్ 06 (ప్రజా స్వరం) :**
నేర రహిత సమాజంగా తీర్చుద్ధిదలంటే నిందితులకు కోర్టులో శిక్ష పడే విధంగా పోలీసు సిబ్బంది శ్రమించాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా విశేష కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిదిలో జరిగిన హత్యా నేరానికి సంబంధించిన కేసులో అప్పటి రామాయంపేట సీఐ చంద్రశేఖరరెడ్డి నేరాన్ని అన్నీ కోణాల్లో పరిశీలించి కోర్టు వారికి కేసుకు సంబంధించిన అన్నీ సాక్షాధారాలను సమర్పించడం జరిగిందన్నారు. అప్పుడు మెదక్ జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్ కేసును వాదించి నిందితులకు జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా పడేలా చేశారన్నారు. అలాగే 2021 సంవత్సరంలో నిజాంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక నేరానికి సంబంధించిన కేసులో అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్ నేరాన్ని అన్నీ కోణాల్లో పరిశీలించి కోర్టు వారికి కేసుకు సంబంధించిన అన్నీ సాక్షాదారాలను సమర్పించడంతో మెదక్ జిల్లా అడిషనల్ సెషన్ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్ కేసును వాదించి నిందితులకు జీవిత ఖైదు, లక్ష 50 వేల రూపాయల జరిమానా పడేలా చేశారన్నారు. నేర రహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్ష పడే విధంగా కోర్టు పోలీసు సిబ్బంది శ్రమించాలన్నారు. కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు సూచనలు స్వీకరించాలని తద్వారా శిక్షల శాతం పెంచాలన్నారు.



# పచ్చదనం పెంచేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్, ఆగస్టు 6 (ప్రజాస్వరం) :**

పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం గుండ్ల పోచం పల్లి మున్సిపాలిటీలో పరిధిలో జిల్లా కలెక్టర్ గౌతమ్, మున్సిపల్ కమిషనర్ స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చదనం కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. అనంతరం ఏజీ కాలనీలో పార్కు స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఆటలు ఆడుకోవడానికి విశాలమైన ఆట స్థలాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.



# సర్కార్ స్థలంలో దర్జాగా రోడ్డు

## అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

**మేడ్చల్, ఆగస్టు 6 (ప్రజాస్వరం) :**

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 145 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ స్థలంలో ఓ వెంచర్ యజమానులు అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని కొందరు అక్రమంగా రోడ్డును నిర్మిస్తున్నారంటూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ తహశీల్దార్ శైలజ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ సర్వేయర్ సిబ్బందితో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయించి, ప్రభుత్వ స్థలంలో సర్వే నిర్వహించి రోడ్డు నిర్మాణం అక్రమమని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డును కూల్చివేయాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.



ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
**-వికారాబాద్, ఆగస్టు 6(ప్రజాస్వరం)**




# విద్యార్థులకు పలకలు పంపిణీ

**గజ్వేల్, ఆగస్టు 6 (ప్రజా స్వరం) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ 2 కేంద్రంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు, బలుపాలు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా లయాబ్స్ క్లబ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వేణు గోపాల్, లయన్ సత్యనారాయణ, డాక్టర్ లయన్ బాలముత్యం, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఆయా రాజమణి, అంగన్‌వాడీ వన్ టీచర్ లక్ష్మి, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల్లో ముక్కిన బియ్యం

**రామాయంపేట, ఆగస్టు 06 (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండల వ్యాప్తంగా ప్రభుత్వం, సరపర చేస్తున్న పౌరసరఫరాల రేషన్ బియ్యం నాణ్యత దిగజారింది. మండల పరిధిలోని లక్ష్మాపూర్, తోనిగండ్ల, గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో ముక్కిన బియ్యం, సరఫరా చేయడంతో స్థానికులు ఆందోళనల వ్యక్తం చేశారు. ముక్కిపోయిన, గడ్డలు కట్టిన, పురుగులు పట్టిన, బియ్యం ఎలా



తింటామంటూ డీలర్‌ను నిలదీశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన బియ్యాన్ని అందజేయాలని, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రక్షిత నీటిని అందించండి

## రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్

**వికారాబాద్, ఆగస్టు 6(ప్రజా స్వరం) :**

రక్షిత మంచినీటిని అందించి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించేలా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపర్చాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ అన్నారు. మంగళవారం ఆమె పూడూర్ మండలం మీర్జాపూర్ గ్రామంలో 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం, వాతావరణ సమతుల్యానికై మొక్కలు నాటాలని, రోగాలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వచ్ఛదనం పచ్చదనం' 5 రోజుల కార్యక్రమాల్లో పరిసరాలన్నింటిని శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి క్లాసు రూమ్‌లో ఫ్యాన్స్, లైట్స్ ఉండేలా చూడాలని, టై లెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని శుద్ధి చేస్తున్న విధానాన్ని, శుద్ధి చేసిన జలాల నాణ్యతను టెస్టింగ్ యంత్రం ద్వారా స్వయంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తూ నీటిని క్లోరినేషన్ జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుదీర్, డీఆర్డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ, మిషన్ బగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో పాండు తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**మేడ్చల్, ఆగస్టు 6 (ప్రజాస్వరం) :**

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో మంగళవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. బీరప్ప కాలనీలో గల ఎల్లమ్మ బావి దగ్గర గల ఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాలను మహిళలు సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తన ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎల్లమ్మ తల్లికి వైభవంగా బోనాలను సమర్పించుకుంటున్నామన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఎల్లమ్మ తల్లిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే సకాలంలో వర్షా లు పడి రైతులకు మంచి దిగుబడి రావాలని మొక్కులు చెల్లించుకున్నానన్నారు. ఉదయం ఎల్లమ్మ వారికి ఘటంతో ప్రారంభమై అమ్మవారికి బోనాల సమర్పించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్, మోహన్‌రెడ్డి, కమిషనర్ స్వామి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్ రెడ్డి, నాయకులు సంజీవగౌడ్, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజ్, ఆర్వో శ్రీనివాస్ గౌడ్, కృష్ణారెడ్డి, కిషన్, సురేష్, ఆంజనేయులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## తాండూర్ డివిజన్ అసిస్టెంట్ సబ్ ట్రెజరీగా వెంకటరమణ

**తాండూరు, ఆగస్టు 6 (ప్రజాస్వరం):**

తాండూర్ డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ సబ్ ట్రెజరీగా ఆర్ వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఏటీవో అజ్మత్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సబ్ ట్రెజరీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటరమణ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ ట్రెజరీ కార్యాలయానికి వచ్చే వారికి అందుబాటులో ఉంటూ బాధ్యత విధంగా పనిచేస్తామన్నారు. అదేవిధంగా తాండూర్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీవోగా మహ్మద్ తాజోద్దీన్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన శ్రీధర్‌రెడ్డి సికింద్రాబాద్ సబ్ ట్రెజరీ పెన్షన్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తాజోద్దీన్ బాధ్యతలు చేపట్టారు.

# కొండగల్ సీఐకి డీజీపీ ప్రశంసలు

**వికారాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం):**

2023లో శ్రీధర్‌రెడ్డి సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు ఒక హత్య కేసు చేధించి పరిశోధన అనంతరం చార్జి సీటు వేశారు. ఆ కేసులో వదోపవాదాలు విన్న సంగారెడ్డి న్యాయస్థానం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డికి డీజీపీ జితేందర్ ప్రశంసించారు. పరిగి పోలీస్ స్టేషన్‌లో కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడినందుకు అప్పటి పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన డీకే లక్ష్మిరెడ్డి, కొడంగల్‌లో రాజాఖాన్ బాలుడిని చంపిన నేరస్థుడికి యావజ్జీవ కారాగార శిక్షపడటంతో అప్పటి కొడంగల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌కు కూడా డీజీపీ ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.



# నిజాంపేట అభివృద్ధికి కృషి

**రామాయంపేట, ఆగస్టు 06(ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా నిజాంపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఆర్థికసాయం అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. నిజాంపేట మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మదనపల్లి పచ్చదనం స్వచ్ఛతనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని రాబోవు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు చౌదరి సుప్రభాత్‌రావు, మండల అధ్యక్షులు మారుతి, అమర్ సేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయసాధనకు కృషి చేయాలి



**తాండూరు, ఆగష్టు 6 (ప్రజాస్వరం) :**

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ఇందిరా చౌక్‌లోని జయశంకర్ విగ్రహం వద్ద తెలంగాణ జన సమితి, ప్రజాసంఘాలు, ఆర్టీసీ జేఏసీ, విద్యావంతుల వేదిక, ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాండూరు జనసమితి ఇన్‌చార్జి సాంబురు సోమశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా అలు పెరుగని పోరాటం సాగించి ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ త్యాగం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త రంగారావు, అధ్యాపకులు తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు పర్యాద రామకృష్ణ, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు చంద్రయ్య, ఎన్ఎస్‌యూఎల్ నాయకులు అనిల్ కుమార్ గౌడ్, ఆర్టీసీ నాయకులు శ్యామసుందర్, అంజిలయ్య, మోదీన్, తెలంగాణ జనసమితి నాయకులు గౌరీ, జగప్ప, ఆదిత్య, సందీప్, విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్, అధ్యాపకులు రాజశేఖర్, హమాలి నాయకులు భద్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్**

**వికారాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం) :**

తెలంగాణ మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం జయశంకర్ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం, 5 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2PM

## సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్

# కళాశాల విద్యార్థుల ధర్నా

- కాలేజీలో దోపిడీని అరికట్టాలని డిమాండ్
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు
- పోలీసుల జోక్యంతో శాంతించిన స్టూడెంట్స్

హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం): ప్రజాస్వరం మేడ్చల్ జిల్లా దూలపల్లి లోని సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాల దోపిడీని అరికట్టాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ముందు ధర్నా చేశారు. బుక్స్, ఫీజుల రూపంలో అక్రమంగా డబ్బులు దండుకుంటున్నారఅంటూ సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై మండిపడుతూ విద్యార్థులు కళాశాల ముందు ఆందోళనకు దిగారు. విద్యార్థుల మందోళనకు ఏబీవీపీ నాయకులు మద్దతు తెలపడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గంటసేపు కళాశాల ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థులను శాంతింపజేశారు. ఈ సందర్భంగా కళాశాల కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ నోట్ బుక్స్, బుక్స్ రూపంలో విద్యార్థుల వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జెఎన్టియు ఫీజును సైతం ఇష్ట రాజ్యాంగ వసూలు చేస్తున్నారని, కొంతమంది దగ్గర రూ.14,000, మరికొంత మంది నుంచి రూ. 8వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదేంటని విద్యార్థులు ప్రశ్నిస్తే.. అది అంతే, మా ఇష్టం.. మీరు కట్టాల్సిందే... కట్టకపోతే ఎగ్జామ్ లో ఫెయిల్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలలోనే నోట్ బుక్స్ అమ్ముతున్నారని, ఆ నోట్ బుక్స్ ను బయటకు ఉంటే రూ.50 రూపాయలకు ఒకటి దొరుకుతుందని, కళాశాలలో మాత్రం రూ.100 రూపాయలు చెల్లించాలని పట్టుబడుతున్నారని, 14 నోటు బుక్కులకు రూ.1,400 రూపాయలు తీసుకుంటున్నారని విద్యార్థులు ఆరోపించారు. ఐడీ కార్డు పేరుతోనూ కళాశాల యాజమాన్యం వేధింపులకు గురిచేస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రతీ రోజు విద్యార్థుల నుంచి కళాశాల సిబ్బంది రూ. 50 నుంచి రూ. 100 రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు దూలపల్లి లోని సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# ఏం చేద్దాం..

## బంగ్లాదేశ్ లో హింసాత్మకంగా రిజర్వేషన్ కోటా నిరసనలు

## ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా.. మిలటరీ రూల్

## ఆశ్రయం కోసం ప్రత్యేక విమానంలో భారత్ కు చేరుకున్న మాజీ ప్రధాని..


## పరిణామాలపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశం

## ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటించిన అఖిలపక్ష పార్టీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ప్రజాస్వరం): బంగ్లాదేశ్‌సంక్షోభం నేపథ్యంలో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి భారత్ లో తలదాచుకునేందుకు వచ్చిన నేపథ్యంలో... భారత కేంద్ర ప్రభుత్వం నేడు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. ఈ అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్రమంత్రి జైశంకర్ స్పందించారు. పొరుగుదేశం బంగ్లాదేశ్ లో పరిణామాలను కేంద్రం నిశితంగా గమనిస్తోందని తెలిపారు. బంగ్లాదేశ్ లో ఉంటున్న భారత పౌరుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అన్ని పార్టీల ప్రతినిధులకు వివరించినట్టు వెల్లడించారు. బంగ్లాదేశ్ అంశంలో కేంద్రం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీల నుంచి ఏకగ్రీవంగా మద్దతు లభించిందని జైశంకర్ ఓ ట్వీట్ లో తెలిపారు. బంగ్లాదేశ్ లో దాదాపు 20 వేల మంది భారతీయులు ఉన్నారని, వారిలో అత్యధిక శాతం మంది విద్యార్థులేనని జైశంకర్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికతో 8 వేల మంది విద్యార్థులు స్వదేశానికి తిరిగొచ్చారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్ సైన్యంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, అక్కడ చోటుచేసుకుంటున్న మార్పులపై సమాచారం సేకరించి, ఆ మేరకు తదుపరి ప్రకటన చేస్తామని వివరించారు. కాగా, బంగ్లాదేశ్ లో షేక్ హసీనా రాజీనామా అనంతరం కీలక పరిణామాలు చేటుచేసుకున్నాయి. ఆ దేశంలో ప్రస్తుతం బీఎన్ పీ-జమాతే కూటమి అధికారాన్ని చేపట్టబోతుందంటూ కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఈ కూటమి పగ్గాలు చేపడితే ఆ ప్రభావం భారత్ పై పడే అవకాశం ఉన్నట్టు పలువురు పేర్కొంటున్నారు. అఖిలపక్ష సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, డీఎంకే నేత టీఆర్ బాలు, సమాజ్ వాదీ పార్టీ నుంచి రామ్ గోపాల్ యాదవ్, తృణమూల్ నేత సుదీప్ బందోపాధ్యాయ్, బీజేడీ నేత సస్మిత్ పాత్రా, ఇతర పార్టీల లోక్ సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు.

## అప్పటి వరకు భారత్ లోనే షేక్ హసీనా..!

షేక్ హసీనా పదవి నుంచి వైదొలిగిన అనంతరం భారత్ కు వచ్చిన విషయం తెలిసిందే. ఆమె మరికొంత కాలం ఇక్కడే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు హసీనాకు భారత ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. షేక్ హసీనా రాజకీయ శరణార్థిగా యూకేలో ఆశ్రయం కోరినట్లు సమాచారం. దీనిపై బ్రిటన్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో యూకే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఆమె భారత్ లో ఉండేందుకు న్యూఢిల్లీ తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ సమయంలో హసీనాకు భారత్ సంస్థాగతంగా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలుస్తోంది. హసీనా సోదరి రెహానా యూకే పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరపున పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం యూకేలో లేబర్ పార్టీనే అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే హసీనా బ్రిటన్ ప్రభుత్వాన్ని ఆశ్రయం కోరినట్లు తెలుస్తోంది.



### ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం..

## వ్యక్తి దుర్మరణం.. తెగిపడిన తల

హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం చోటు చేసుకుంది. నిన్న రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టింది. కారు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో వ్యక్తి తల తెగి కారు వెనుక సీటులో పడింది. మృతుడిని శంషాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గాగిల్లాపూర్‌లో దారుణం..

## బీర్ బాటిల్‌తో స్నేహితుడిపై దాడి

హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం): మేడ్చల్ జిల్లాలోని గాగిల్లాపూర్‌లో కొంతమంది యువకులు గంజాయి సేవించి హల్‌చల్ సృష్టించారు. స్నేహితుడిపై బీరు బాటిల్‌తో విచక్షణా రహితంగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు గమనించి సమీప ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులు మదన్ కుమార్, సాయిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

## ‘చిన్నమ్మ’కు ఘన నివాళులు..

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్







హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం): మాజీ కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ గారి వర్ధంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాళులు అర్పిస్తూ ఆయన ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని ఎలుగెత్తి చాటిన ‘చిన్నమ్మ’, భారత విదేశాంగ విధానానికి కొత్త నిర్వచనం ఇచ్చిన సంస్కర్త, మహిళా సాధికారతకై అనునిత్యం పరితపించిన ధీశాలి, బహుముఖ ప్రజ్ఞాశాలి,మాజీ కేంద్రమంత్రి, పద్మవిభూషణ్ శ్రీమతి సుష్మా స్వరాజ్ గారి వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

### తెలంగాణ పౌరుషాన్ని తట్టి లేపిన స్ఫూర్తిప్రదాత.. జయశంకర్

తెలంగాణ పౌరుషాన్ని తట్టి లేపిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ట్వీట్ చేశారు. తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ట్వీట్టర్ వేదికగా నివాళులు అర్పించిన ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటానికి ఊపునిచ్చిన ఉద్యమ శిఖరం, పుట్టుక మీది, చావు మీది.. బ్రతుకంతా తెలంగాణది అని తన ట్వీట్ లో పేర్కొన్నారు.



# మీ అడుగుజాడల్లోనే పోరాటం..

### జయశంకర్‌కు కేటీఆర్, హరీశ్ ఘన నివాళులు

హైదరాబాద్, ఆగస్టు 6 (ప్రజాస్వరం): ‘తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి మీరు చేసిన కృషి అనిర్వచనీయం.. మీ అడుగుజాడల్లోనే తెలంగాణ రాష్ట్ర పోరాటం కొనసాగింది’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ట్విట్టర్ లో నివాళులర్పించారు. పుట్టుక మీది.. చావు మీది.. బ్రతుకంతా తెలంగాణది.. అని జయశంకర్ సార్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. అలాగే, ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్, కేపీ వివేకానంద తదితరులతో కలిసి ప్రొ.జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం జయశంకర్, కేసీఆర్ కలిసి ఢిల్లీలో అన్ని పార్టీలను ఒప్పించారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం జయశంకర్–భూపాలపల్లి జిల్లాకు ఆయన పేరు పెట్టడం ద్వారా కేసీఆర్ ఘనంగా నివాళులర్పించారని అన్నారు.